క్లుప్తంగా

ఖాతాదారుల సొమ్ములను చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏజెంట్లు

రామచంద్రపురం: కమీషన్ ఏజెంట్ల ద్వారా సహారా ఇండియా సేకరించిన డిపాజిట్ సొమ్ము వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏజెంట్లు స్థానిక సెక్టార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఎంవీరావు, కేవీ ప్రభావతి పి.అజయ్‌బాబు, వి.ఏడుకొండలు, టీఎస్ఎస్ సత్యనారాయణ, పీవీ భాస్కరరావు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా సహారా ఇండియా కంపెనీ సూచనల మేరకు కోట్లాది రూపాయలు డిపాజిట్లు ఖాతాదారుల నుంచి సేకరించామన్నారు. కాలపరిమితి ముగిసిన డిపాజిట్లకు కంపెనీ చెల్లింపులు చేయటం లేదన్నారు.

చిన్నారులకు పండ్ల పంపిణీ



చిన్నారులకు పండ్లు అందజేస్తున్న కృష్ణారెడ్డి, ట్రస్ట్ సభ్యులు

రాయవరం: లొల్ల గ్రామంలోని మానవత ఆశ్రమంలో చిన్నారులకు అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. కృష్ణారెడ్డి కుమారుడు స్వర్గీయ సురేష్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని చిన్నారులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో సబ్బెళ్ల సురేష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చింతా ప్రభాకరరెడ్డి, నల్లమిల్లి శివసాయినాథ్‌రెడ్డి, మల్లిడి శివకుమార్‌రెడ్డి, పులగం శివారెడ్డి, కర్రి సతీష్‌రెడ్డి, నల్లమిల్లి సందీప్‌రెడ్డి, గుడిమెట్ల శివశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో 162 మందికి వైద్య సేవలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎన్‌డీ రత్నకుమారి పర్యవేక్షణలో స్థానిక సత్యనారాయణపురంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ జె.అనూజ ప్రియాంక 162 మంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ సురేష్, మేరీమణి, వైద్య ఆరోగ్య కార్యకర్తలు సేవలందించారు.

ఇఫ్టూ మహాసభలు విజయవంతం చేయాలి

మండపేట: ఈనెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించే ఇఫ్టూ 9వ రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున కార్మికులు తరలి వచ్చి విజయవంతం చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నేత గెద్దాడ సూరిబాబు కోరారు. మండలంలోని ద్వారపూడి క్లాత్ మార్కెట్‌లో శుక్రవారం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సంఘ నాయకులు మహాసభల్లో దిశా నిర్దేశనం చేస్తారన్నారు. కార్మిక నాయకులు పోతురాజు, సత్యనారాయణ, రాంబాబు, రామకృష్ణ, సతీష్, నూకరాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు నిర్మించాలి

కాజులూరు: మండలంలోని పల్లిపాలెం శివారు కాళావారిపేటలో మురుగు కాలువలు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాళా సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు కోరారు. శుక్రవారం గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో ఏ ఒక్క వీధిలోనూ మురుగు కాలువలు లేకపోవటంతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారన్నారు. ఇళ్లలోని వాడకం నీరు బయటకు పోయే మార్గాలు లేకపోవటంతో రోడ్డుపైకి చేరి బురదగా మారుతోంది. అధికారులు స్పందించి గ్రామంలో డ్రైయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పొడిగించాలి

యానాం: యానాం వాసులకు ఉపయోగకరంగా ఉండే విధంగా కాకినాడ- చెన్నై సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలును పుదుచ్చేరి వరకూ పొడిగించాలని పుదుచ్చేరి ఎంపీ వైద్యలింగం కోరారు. నూతన ట్రైన్‌ల కోసం శుక్రవారం తిరుచిలో జరిగిన దక్షిణ భారత రైల్వే సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సర్కార్ ఎక్స్‌ప్రెస్ చెంగల్‌పట్టు వరకూ వెళుతుందన్నారు. అక్కడి నుంచి కేవలం 100 కిలోమీటర్ల దూరం పుదుచ్చేరి ఉందని రైల్వే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

శివోహం.. సన్నాహం

భీమేశ్వరాలయంలో ఏర్పాట్లు పూర్తి

రామచంద్రపురం రూరల్: పంచారామాలలో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాలలో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా భాసిల్లుతున్న భూకైలాసం ద్రాక్షారామంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి దేవాలయం నేటి మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబైంది. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తుతారు. ఆలయంలో తెల్లవారుజామున 2.30 గంటలకు సప్తగోదావరి నుంచి తీర్థపు బిందె తీసుకుని వచ్చి సుప్రభాత సేవ, ప్రాతఃకాల అర్చన, బాలభోగం కార్యక్రమాలు నిర్వహిస్తారు. 3 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా తొలి అభిషేకం నిర్వహిస్తారు. 33 మట్టి కుండలతో అభిషేక ద్రవ్యాలు, సప్త నదుల జలాలు, 12 గుండాల నుంచి సేకరించిన జలాలతో 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఏకాదశ రుద్ర హోమం, పూజలు నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజ చేస్తారు. రాత్రి 11.30 గంటలకు స్వామికి రాజ భోగం సమర్పిస్తారు. అప్పటి నుంచి రాత్రి 12 గంటల వరకు దర్శనానికి విరామం ఇస్తారు. 12 గంటల నుంచి రాత్రి 1.30 గంటల వరకు స్వామివారి లింగోద్భవ దర్శనానికి అనుమతిస్తారు. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వర రావు) భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని కొబ్బరి ఆకులతో చలువ పందిరిలను వేశారు. కూలర్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు మజ్జిగ, మంచినీళ్లు, పులిహోర, చక్ర పొంగలి, బిస్కెట్లు ఇచ్చేలా సేవాదళాలను సిద్ధం చేశారు.



ద్రాక్షారామ శ్రీ భీమేశ్వరస్వామివారు



కోటిపల్లిలోని ఛాయాసోమేశ్వర స్వామి

కోటిపల్లిలో...

కె.గంగవరం: మహాశివ రాత్రి సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కె.గంగవరం మండలంలోని కోటిపల్లి గ్రామంలో కొలువైయున్న శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నాం వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన సుమారు లక్షన్నర మంది భక్తులు కోటిపల్లికి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. తెల్లవారు జామున గౌతమీ నది నుంచి తీర్థం బిందె తీసుకువచ్చి సోమేశ్వరస్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి 6 గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం ఆలయం వద్ద రథోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు ఆలయం మంటపం పైభాగాన కోటి దీపోత్సవం నిర్వహిస్తామని ఈఓ రామలింగేశ్వరరావు తెలిపారు. రాజమహేంద్రవరం, రావులపాలెం, యానాం, కాకినాడ ప్రాంతాల నుంచి కోటిపల్లి గ్రామానికి ఆర్టీసీ 70 బస్సులు అదనంగా నడపనుంది. క్యూల వద్ద భక్తుల కోసం టెంట్లు ఏర్పాటు చేశారు. గౌతమి గోదావరి నది పుష్కరఘాట్ వద్ద భారీ బందోబస్తు మధ్య పుణ్యస్నానాలు ఆచరించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. గత ఈతగాళ్లను, పడవలను ఏర్పాటు చేసి గస్తీ నిర్వహించనున్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం రాకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకున్నారు. రేవులో వృద్ధులు, వికలాంగుల కోసం జల్లు స్నాన్న ఘట్టం కూడా ఏర్పాటు చేశారు. పామర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆలయంతో పాటు రేవులో వైద్య శిబిరాలు, అంబులెన్సు ఏర్పాటు చేశారు. బారికేడ్లు, భక్తులకు ఎండ తగలకుండా టెంట్లను ఏర్పాటు చేశారు. 300 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలు



ఆలయం బయట ఏర్పాటు చేసిన క్యూలు

కాజులూరు మండలంలో..

కాజులూరు: మండలంలోని పలు గ్రామాలలో శనివారం మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదూరు, కుయ్యేరు, అయితపూడి, పెనుమళ్ల, అంద్రంగి, పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కోలంక, జగన్నాథగిరి గ్రామాల్లో శివాలయాలు ఉన్నాయి. వేకువజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా నిర్వహక కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. పరిసర గ్రామాల నుంచి శివాలయాలకు వచ్చే పిల్లలు, పెద్దలు, మహిళలకు ఇబ్బందులు కలుగకుండా వసతులు సమకూర్చినట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.



పడమర ఖండ్రిక ఉయ్యాల జంపాలలో స్వామి కల్యాణ పూజ చేస్తున్న భక్తులు

ఘనంగా త్రయంబకేశ్వర స్వామి కల్యాణం

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంలో కొలువైన అన్నపూర్ణా సమేత త్రయంబకేశ్వరస్వామి వార్షిక కల్యాణం శుక్రవారం ఆలయం కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కొత్తలంకకు చెందిన శ్రీకంఠం ప్రభాకరశర్మ బ్రహ్మత్వంలో ఆలయ ప్రధానార్చకుడు కొమాళ్ళపల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, వెంకటేశ్వరరావు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ క్రతువు చేశారు. దేవతా మూర్తులను విశేషంగా అలంకరించారు. ఆలయం వద్ద శనివారం తీర్థం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సోమేశ్వరంలోని వైభవంగా గ్రామోత్సవం



ద్వారపూడి కనకరాజు స్వామికి జ్ఞాపికను బహూకరిస్తున్న మహారుద్రయాగ కమిటీ

రాయవరం: సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పంచాయతన మహా రుద్రయాగంలో భాగంగా శుక్రవారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మశ్రీ చంద్రాభట్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో 100 మంది వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వేద పండితులు యాగాలు నిర్వహించారు. ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకరాజు స్వామి మహారుద్రయాగాన్ని సందర్శించారు. అధిక సంఖ్యలో దంపతులు యాగశాలలో నిర్వహిస్తున్న యాగ క్రతువులో పాల్గొని పూజాదికాలు నిర్వహించారు. మహా రుద్రయాగంలో భాగంగా నిర్వహించిన గోపూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమేశ్వరం, పరిసర గ్రామాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రుద్రయాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుద్రయాగ కమిటీ ఆధ్వర్యంలో యాగానికి హాజరైన భక్తులకు ఘనంగా అన్నసమారాధన చేశారు.

భీమేశ్వరాలయ ఈఓకు సత్కారం



ఈఓ తారకేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: భీమేశ్వరాలయంలో విశాలమైన హోమశాల, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారంటూ భీమేశ్వరాలయ పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు)ను శుక్రవారం సత్కరించారు. కమిటీ అధ్యక్షుడు పెమ్మిరెడ్డి రామకృష్ణ, కార్యదర్శి, వార్డు సభ్యుడు డేగల వెంకటరమణ, సభ్యులు చిన్ని గీత, నవీన్, వార్డు సభ్యుడు సాక్షి పద్మనాభం పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతా..



మంత్రి వేణుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామచంద్రపురం: అమలాపురం అల్లర్ల కేసులో అమాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గత మేనెలలో అమలాపురంలో జరిగిన అల్లర్ల కేసుల్లో పోలీసులు అమాయకులపై కేసులు పెట్టారని, విముక్తి కలిగించాలని కోరుతూ మంత్రి వేణుకు పట్టణంలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి మురళీకృష్ణ, తదితరులు వినతిపత్రం అందజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ కేసుల్లో ఇరుక్కున్న అమాయకుల వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వివరిస్తామని తెలిపారు. నాయకులు మట్టపర్తి చంద్రశేఖర్, కాశిన ఫణీంద్ర, మట్టపర్తి సూర్యప్రకాశరావు, మోటూరి రత్నప్రసాద్, కాశిన గణేష్, ఈతకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణ యాగం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో మాఘ మాసం పురస్కరించుకుని ఆలయ ఈఓ పీకే లక్ష్మణరావు ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీనారాయణ యాగం ఘనంగా నిర్వహించారు. వాడపల్లి గోపాలాచార్యులు, వైదిక బృందం బ్రహ్మత్వంలో విష్వక్సేన ఆరాధన, కుంభ పూజ, పంచామృత మంటపారాధన, లక్ష్మీనారాయణ హోమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సర్పంచ్, రాష్ట్ర ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ దంపతులు, గ్రామ ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, సూరిబాబు దంపతులు, గ్రామ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పలివెల నాగరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఆయన తనయుడు నరేన్, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, మండల వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, కొత్తపల్లి అరుణ, పెమ్మిరెడ్డి దొరబాబు, పలివెల లోవరాజు, వీరబోయిన సూరిబాబు పాల్గొన్నారు.



వెలంపాలెంలో లక్ష్మీనారాయణస్వామిని దర్శించుకున్న మంత్రి వేణు

సబ్సిడీపై ఎలుకల నివారణ మందు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 20న మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఎలుకల నిర్మూలన మందును 100 శాతం సబ్సిడీపై రైతులకు అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. జగన్నాయకులపాలెం, ఉండూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పంట పొలాలను సందర్శించి ఎలుకల బొరియలను ఏఓ గుర్తించారు. బ్రోమోడయోలిన్‌కు నూకలు, నూనె వంటి పదార్థాలను కలుపుకుని చిన్నచిన్న పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల్లో పెట్టాలని సూచించారు.

ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలి



డాక్టర్ స్పందనతో సమావేశానికి హాజరైన అంగనవాడీ, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు

మండపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటన్నింటిని క్షేత్రస్థాయిలో అందజేయాల్సిన బాధ్యత అంగనాడీ, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలపై ఉందని అర్బన్ పీహెచ్‌సీ వైద్యురాలు స్పందన అన్నారు. స్థానిక అర్బన్ పీహెచ్‌సీలో శుక్రవారం అంగనవాడీ, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.సింహాచలం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ అంగనవాడీ కార్యకర్తలు హౌస్ విజిట్‌కు వెళ్లినపుడు గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, రక్తహీనతను తగ్గించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని గుర్తించి వారికి అవసరమైన వైద్య సాయం అందించేందుకు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు కృషి చేయాలన్నారు. సూపర్‌వైజర్ సింహాచలం తన ప్రసంగంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.

స్ప్రేయర్లు భద్రపరచడం ఇలా..

- పురుగు మందు పిచికారీలో శాస్త్రీయ పద్ధతులు
- పరికరాల పరిశుభ్రంపై అవగాహన అవసరం
- ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



చేనుకు పురుగులు మందును పిచికారీ చేస్తున్న రైతు



కేవీఎస్ రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం: వరి సాగు సజావుగా సాగాలంటే రైతులు అవగాహనతో మెలగాలి. పంట సస్యరక్షణతో పాటు తన ఆరోగ్య రక్షణకు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ పనుల్లో కాయకష్టం చేయడం అలవాటు అయినదే అయినప్పటికీ పంటకు ఎరువులు, పురుగు మందులు వాడేటపుడు రైతు శారీరకంగానూ మానసికంగానూ అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది. మరీ ముఖ్యంగా మందులను పిచికారీ చేసే యంత్రాల వినియోగంలో అవగాహన అవసరం. పురుగు మందులను పిచికారీ చేసేటపుడు వ్యవసాయ శాఖాధికారులు, వైద్యుల సూచనలను పాటించాల్సిందే. కపిలేశ్వరపురం మండలం వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ చేస్తున్న సూచనలు ఇలా..

రెండు నియోజకవర్గాల్లో వరి సాగు ఇలా...

రామచంద్రపురం నియోజవర్గంలోని 75 గ్రామాల్లో 53,249 ఎకరాలు, మండపేట నియోజవర్గంలోని 43 గ్రామాల్లో 47,418 ఎకరాలు, మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 1,00,667 ఎకరాలను రబీ సాగు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఎరువులు, పురుగు మందులను వినియోగం ఇప్పటికే ప్రారంభమైంది.

అశ్రద్ధ వద్దు

స్ప్రేయర్లను ఒక్కో దశలో మాత్రమే వినియోగిస్తారు. పని అయిన తర్వాత పక్కన పడేస్తారు. ఇలా చేయడం ద్వారా అవి పాడయ్యే ఇబ్బందులున్నాయి. అందుకోసం ఈ విషయాలు గుర్తు చేసుకోవాలి...

- ఆధునికత నేపథ్యంలో బ్యాటరీ రీ చార్జిబుల్ స్ప్రేయర్లు ఉనికిలోకి వచ్చాయి. పవర్ స్ప్రేయర్లతో పోలిస్తే బ్యాటరీ రీచార్జిబుల్ స్ప్రేయర్లు బరువు తక్కువ ఉంటుంది. పైరుపై మందు స్పీడ్ తగు మోతాదులో చిమ్ముతుంది.
- వీటిని భద్రపర్చేందుకు నీటిని స్ప్రే చేస్తూ శుభ్రం చేయాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి కనీసం ఒక గంట పాటు చార్జింగ్ పెడుతుండాలి. దీని ద్వారా బ్యాటరీ సామర్థ్యం దెబ్బతినకుండా ఉంటుంది.
- పవర్ స్ప్రేయర్ టర్బోనేటర్, ట్యాంకులోనూ పెట్రోల్ లేకుండా చూసుకోవాలి. పిచికారీ ప్రక్రియ పూర్తికాగానే మంచినీటితో శుభ్రం చేయాలి. ప్లగ్‌ను తీసి పెట్రోల్‌తో శుభ్రపర్చి, పిస్టన్‌పై కాస్త ఇంజిన్ ఆయిల్‌ను వేసి బిగించాలి.
- తైవాన్ స్ప్రేయర్ లో ఐదారు లీటర్ల నీరు పోసి నాజిల్ ద్వారా బయటకు స్ప్రేయాలి. దీని వల్ల స్ప్రేయర్‌లో చిక్కుకున్న మలినాలు బయటకు వచ్చేస్తాయి.
- హ్యాండ్ స్ప్రేయర్ల విషయంలో ఇత్తడి స్ప్రేయర్ గొట్టం తీసి అందులో కాస్త ఇంజిన్ ఆయిల్ పోసి బిగించాలి. దీనివల్ల తుప్పు పట్టకుండా ఉంటుంది. హైటెక్ స్ప్రేయర్లలో బుష్‌లు, రాడ్లుకు ఇంజిన్ ఆయిల్‌ను పూయాలి.

ఖాళీ డబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలి

పురుగు మందు ప్రభావంతో అస్వస్థతకు గురైన వ్యక్తికి వెంటనే ప్రథమ చికిత్స చేయాలి. అందులో భాగంగా రోగి శరీరానికి ఉష్ణోగ్రత అధికంగా ఉంటే తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలి. ఉష్ణోగ్రత మరీ తక్కువగా ఉంటే దుప్పటి కప్పాలి. నోటిలో వేలు పెట్టి వాంతి అయ్యేటట్టు చేయాలి. ప్రథమ చికిత్స చేసిన అనంతరం రోగిని వైద్యుని దగ్గరకు తీసుకెళ్లాలి. చేనుకు వాడిన మందు తాలూకు వివరాలు కచ్చితంగా వైద్యునికి తెలియజేయాలి.

ఎలుకల సామూహిక నివారణ చేపట్టాలి



ఎలుకల మందు తయారీని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి అశోక్ తదితరులు

కాజులూరు: మండల గ్రామాలలో జరుగనున్న ఉచిత ఎలుకల మందు పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం జగన్నాథగిరిలో ఆయన మాట్లాడుతూ మండల గ్రామాలలో ప్రస్తుతం వరి పంటపై ఎలుకల బెడద ఎక్కువగా ఉందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తుందని కాజులూరు మండలానికి 86 కేజీల మందు విడుదలయ్యిందన్నారు. మందు ఎరను తయారు చేసుకునే విషయంపై ఇప్పటికే ఆర్‌బీకే సిబ్బందికి, రైతులకు శిక్షణ ఇచ్చామన్నారు. రైతులందరూ ఒకేమారు సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలన్నారు.


ఆకట్టుకున్న కోనసీమ కొబ్బరి పీచు బొమ్మలు



న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన బొమ్మల స్టాల్

మామిడికుదురు: స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన ఎంప్లాయిమెంట్ జనరేషన్ నేషనల్ వర్క్ షాపులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన మహిళలు కొబ్బరి పీచుతో తయారు చేసిన బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూడురోజుల పాటు జరిగే వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపులో పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొబ్బరి పీచుతో తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించే అరుదైన అవకాశం లభించింది. వివిధ రాష్ట్రాల నుంచి వర్క్ షాపునకు హాజరైన ప్రతినిధులను కొబ్బరి పీచుతో తయారు చేసిన బొమ్మలు ఆకట్టుకున్నాయి. ఈ బొమ్మలను వీక్షించిన ప్రతినిధులు వీటిని తయారు చేసిన మహిళలను అభినందించారని ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధర్ పేర్కొన్నారు.

కబడ్డీ పోటీలకు ధర్మాజీ



ఆలమూరు: మండలంలోని నర్సిపూడి గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొంకిపూడి ధర్మాజీ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకూ జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు. ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక అవార్డులు, బంగారు పతకాలు సాధించి ప్రతిభను నిరూపించుకున్నాడు. అందులో భాగంగానే ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా సర్వీసెస్ నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొననున్నాడు.

ముసాయే ఖాజిమ్‌కు నివాళి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం ఏడవ ప్రవక్త హజరత్ ఇమామ్ మూసాయే ఖాజిమ్ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలో శుక్రవారం గుమ్మటాన్ని ఊరేగించారు. మొల్లా పంజా నుంచి గుమ్మటాన్ని తీసి మాతం చేస్తూ పెద పంజీషా వరకు ఊరేగించారు. మూసాయే ఖాజిమ్‌కు నివాళులర్పించారు. మొల్ల సిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మొదట మంజిలే కర్బలాలో షహదత్ మజ్లిస్ జరిగింది.